క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

వాంకిడి: మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన మడావి విజయ ఇటీవల మృతి చెందగా, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం కింద తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. కాగా నామినీగా ఉన్న మృతురాలి తండ్రి మడావి జలపతికి బ్యాంకు మేనేజర్ విష్ణువర్ధన్ మంగళవారం బీమా చెక్కు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్న ప్రతీ ఒక్కరు బీమా చేయించుకొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, అకౌంటెంట్ అనిల్, క్యాషియర్ వాగు, సీఎస్పీ ప్రతినిధి దుర్గం రాకేశ్ పాల్గొన్నారు.

దహెగాంలో అంధకారం

దహెగాం: మండలంలో సోమవారం రాత్రి గాలి దుమారం లేవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గాలి దుమారానికి అంతరాయం ఏర్పడడంతో రాత్రంతా ప్రజలు తీవ్ర ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 9 గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. తాగునీటికి సైతం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఇన్‌టౌన్ -1 లైన్‌లో పీఎంఐ ప్రీమాన్సూన్ ఇన్‌స్పెక్షన్ ప్రోగ్రాం ఉన్నందున పట్టణంలోని సందీప్‌నగర్, బజార్‌వాడీ, పైకాజీనగర్, మేన్‌బజార్, బస్టాండ్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఏకరూప దుస్తులకు కొలతలు

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టేందుకు మంగళవారం కొలతలు తీసుకున్నారు. 31 గ్రామ పంచాయతీలోని 86 పాఠశాలల్లో చదువుతున్న 4223 మంది విద్యార్థుల కొలతలు తీసుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో యూనిఫామ్‌లు కుట్టనున్నారు.

విద్యార్థులు పుస్తకపఠనం చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

ఆసిఫాబాద్‌రూరల్: వేసవి సెలవుల్లో పిల్లలు పుస్తకపఠనం చేయాలని, ఇందు కోసం తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ అన్నారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో చివరి రోజు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో సాధించిన ప్రగతి, విద్యార్థుల పురోగతి, తదితర అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయులు శంకర్, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: గురుకులాల్లో సీటు సంపాదించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను మంగళవారం జిల్లా కోఆర్డినేటర్ మధూకర్, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రాజం సన్మానించారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మండలంలోని వంజీరి, అంకుసాపూర్ గ్రామ పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతి, శశికాంత్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రాపూర్ గ్రామంలో ఉద్రిక్తత

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో గల ఎస్సీ కమ్యూనిటీ భవనం ముందు ఏర్పాటు చేసిన పంచశీల జెండా కిందపడి ఉండడంతో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పంచశీల జెండా కిందపడి ఉండడంతో అవమానం జరిగిందని ఆరోపిస్తూ పలు సంఘాల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. సమీపంలో వారు ఆరా తీయగా ట్రాక్టర్ తగిలి పడిపోయినట్లు అక్కడ ఉన్న ఓ వ్యక్తి సమాచారం ఇచ్చాడు. అయితే నాయకులు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే జెండాను కింద పడేశారని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కాగా ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా ఘటనపై ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కష్టంగా ‘కౌలు’..!

- ఏటా పెరుగుతున్న ధరలు
- ఎకరం భూమికి రూ.12 వేల నుంచి రూ.15 వేలు
- సాగు చేసేందుకు తిప్పలు
- ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతుల వేడుకోలు



కౌటాలలో భూమిని దున్నుతున్న కౌలు రైతు(ఫైల్)

కౌటాల: జిల్లాలో ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలు సంమృద్ధిగా పండకపోయినా కౌలు ధరలు మాత్రం పెరుగుతున్నాయి. సాగు మీద ఉన్న ప్రేమతో కౌలు రైతులు భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పుడు కాకపోయినా మరో ఏడాదైనా సాగు బాగు చేస్తుందని రైతులు ఆశతో కౌలు భూములను సాగు చేస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుబంధు, రైతుబీమా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడితే.. కేంద్రం పంట పెట్టుబడి అందిస్తుంది. ఇవన్నీ రైతులకు ఎంతో కొంత లబ్ధిచేకూరుస్తున్నాయి. కౌలు రైతుల పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా కౌలు రైతులను పట్టించుకునే ప్రభుత్వాలే కరువయ్యాయి.

రైతుబంధు వస్తున్నా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారు మొత్తం లక్షా45 వేల వరకు రైతులుండగా వారిలో సుమారు 35 వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కౌలు రైతులు భూ యజమానుల దగ్గర కౌలు మాట్లాడుకుంటున్నారు. దిగుబడి వచ్చినా, రాకపోయినా, రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేలు భూ యజమానులకు వస్తున్నా కౌలు తగ్గడం లేదు. ప్రభుత్వాల సాయం కొరవడడంతో పాటు పంట రుణాలు కూడా రాని పరిస్థితి ఉండడంతో కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర వడ్డీకి తెచ్చి సాగు చేస్తున్నారు.

భూమి రకాన్ని బట్టి కౌలు ధర..

భూమి రకాన్ని బట్టి కౌలు ధరను రైతులు నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నల్లరేగడి, ఎర్రరేగడి, పలు రకాల భూముల కోసం ఎకరానికి రూ.13 వేల నుంచి రూ. 16 వేల వరకు చెల్లిస్తున్నారు. పత్తి సీజన్ పూర్తయ్యే వరకు మాత్రమే లీజు కుదుర్చుకుంటున్నారు. ఇందులో రహదారి పక్కన, సాగు నీటి సౌకర్యం ఉన్న భూములకు అదనంగా లీజు చెల్లిస్తున్నారు. చేను భూములకు ఎకరానికి రూ. 12 వేల నుంచి రూ.18 వేల వరకు కౌలు ధర చెల్లిస్తున్నారు. వరి పంట పొలాలకు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు కౌలు ధర చెల్లిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు భూమి లీజుకు ఇవ్వడానికి ఒప్పందం చేసుకోగా, ఇంకా లీజు భూముల కోసం జోరుగా యత్నాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఎకరాకు రూ.18 వేలు ధర చెల్లించాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. కాగా భూ యజమానులు కౌలు భూములకు ధరలు తగ్గించాలని కౌలు రైతులు వేడుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

భూముల కోసం తిరుగుతున్నారు



గతంలో కౌలు భూమి ఎకరానికి రూ.6 వేల నుంచి రూ.8 వేలు మాత్రమే ఉండేది. ఒకరిని చూసి మరొకరు పత్తి పంట సాగు చేస్తుండడంతో లీజు ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు ఎకరానికి రూ.10వేలు ఇస్తామన్నా భూమి లీజుకు ఇవ్వడం లేదు. ప్రస్తుతం కౌలు రైతులు భూముల కోసం గ్రామాల్లో తిరుగుతున్నారు.

- హన్మంతు, కోయగూడ

సాగు మీద ఉన్న ప్రేమతో..



ఏటా కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి అందని పరిస్థితులు ఉంటున్నాయి. దిగుబడి వచ్చినా, రాక పోయినా ఏటా భూ యజమానులకు కౌలు చెల్లించాల్సి వస్తోంది. తమ దయనీయ పరిస్థితి చూసైనా ధర తగ్గించడం లేదు. సాగు మీద ఉన్న ప్రేమతో భూమి కౌలు చేస్తున్నాను.

- దిగంబర్, యాపలగూడ

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



వరి పంట పరిశీలిస్తున్న ఏవో రాజేశ్

కౌటాల: అకాల వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉందన్నారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారని, ఈదురు గాలులు వీచినప్పుడు రైతులు సురక్షిత ప్రాంతానికి వెళ్లాలన్నారు. వరి కోత దశలో ఉన్నందున పొలంలో ఎక్కువగా నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: మండుతున్న ఎండల దృష్ట్యా నర్సరీల్లో ఉన్న మొక్కలకు ప్రతీరోజు నీళ్లు పోయాలని ఎంపీడీవో కృష్ణారావు, ఈజీఎస్ ఏపీవో మలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎంపీవో అంజద్ పాషా, ఈసీ ఐక్యనాయక్ ఉన్నారు.

ముకదంగూడలో గ్రామసభ

కెరమెరి: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో గల ముకదంగూడ గ్రామంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకంలో అనేకమందికి జాబ్‌కార్డులు లేవని, అందుకు ఉపాధిహామీ పనులు కోల్పోతున్నామని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఎంపీడీవో కృష్ణారావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏ మహేందర్ గ్రామాన్ని సందర్శించారు. జాబ్‌కార్డులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.

ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ



ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు

వాంకిడి: మండలంలోని ఇందాని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పిల్లల విద్యాసామర్థ్యాలపై చర్చించారు. తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. హెచ్‌ఎం కలేరాం, ఉపాధ్యాయులు శ్రావణి, భాగ్యలక్ష్మి, శ్వేత, అమరేశ్వరి పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఎఫ్ఏ 1, 2, 3, 4, ఎస్ఏ -1, 2లకు సంబంధించిన మార్కుల ప్రోగ్రెస్ కార్డులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి ఆలయంలో చైత్ర పౌర్ణమి పురస్కరించుకొని మూడు రోజుల మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. జాతర మహోత్సవంలో మొదటి రోజు మంగళవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అమ్మవారి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, కంకణాలు రాగా బాజా భజంత్రీల నడుమ పట్టువస్త్రాలు, తలంబ్రాలు ఆలయానికి తీసుకొచ్చారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. రాత్రి ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు బోనాల జాతర వన భోజనాలు

మహంకాళి జాతరలో భాగంగా బుధవారం అమ్మవారి బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి బోనాల సమర్పణతో పాటు నైవేద్యాలు, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



తలంబ్రాలు పోస్తున్న భక్తులు



పట్టువస్త్రాలు ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వీర హనుమాన్ శోభాయాత్ర



దహెగాం: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు

దహెగాం: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి మార్కెట్ ఏరియా, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా యువతీ, యువకులు నృత్యాలు చేశారు. పాత దహెగాంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెంచికల్‌పేట్: హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ విగ్రహం వద్ద పెంచికల్‌పేట్ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. యాత్రలో జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు పిక్లాతండా, దంపూర్, కంచన్‌పల్లి, జాముల్‌ధరా, రాము నాయక్ తండా, వంకామద్ది, లోద్దిగూడ, మోతిపటార్, చోర్‌పల్లి గ్రామపంచాయతీలతో పాటు వివిధ గ్రామాలలో మంగళవారం హనుమాన్ భక్తులు జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అన్నదానం నిర్వహించారు.

ఆసిఫాబాద్‌రూరల్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. హనుమాన్ దీక్షలు స్వీకరించిన భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కెరమెరి: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని శివాలయంతో పాటు సావర్‌ఖెడా, బాబేఝరి, అనార్‌పల్లి, కెలికే, కెలిబి, సాంగ్వి, గోయగాం తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో బాలాజీ మహరాజ్ ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాయలంలో హనుమాన్ మాలధారణ స్వాములు 108సార్లు హనుమాన్ చాలీసా పఠించారు. మండలకేంద్రంలో సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బెజ్జూర్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దాపూర్, ఎలుకపల్లి, కృష్ణపల్లి, ఏటిగూడా గ్రామాల వరకు ద్విచక్ర వాహనాలతో భక్తులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో పూజలు జరిపారు. భక్తులు తిరుపతి, శ్రీవర్ధన్, మహేశ్, సుధాకర్ గౌడ్, నిలేష్, శ్రీనివాస్, రమేశ్, శంకర్, గోపాల్, బాలాజీ, నగేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో..



లింగాపూర్‌లో..



కాగజ్‌నగర్‌రూరల్: శోభాయాత్ర చేస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌రూరల్: పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. బాలభారతి హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. హనుమాన్, శ్రీరాముడు, బలరాముడు, ఛత్రపతి శివాజీ విగ్రహాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు పూజా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. కాపువాడలోని పంచముఖ ఆంజనేయ ఆలయంలో 10,116 తమలపాకులతో ఆంజనేయస్వామికి స్వాగత అలంకరణతోరణం, గర్భగుడి అలంకరణ, హోమం నిర్వహించారు.



కెరమెరి: అనార్‌పల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



రెబ్బెన: శోభాయాత్రలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు



బెజ్జూర్: పూజలు చేస్తున్న చిన్నసిద్దాపూర్ భక్తులు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మిల్లు ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం యాజమాన్యం సహకారంతో మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మిల్లు ప్రతినిధులు తెలిపారు. ఎస్పీఎం మిల్లు ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, రీణా బివాల్, తుమ్మ రమేశ్, జంషద్ అలీ పాల్గొన్నారు.

‘పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రాధాన్యమైనది’

ఆసిఫాబాద్‌రూరల్: పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి అలవాటు కాకముందు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రాధాన్యమైనదని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సోంబాయి అన్నారు. మంగళవారం మండలంలోని గుండి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్ వాడీ సెంటర్‌లలో నాణ్యమైన విద్యతో పాటు పిల్లలకు కావాల్సిన పోషకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్ వాడీ టీచర్లు పద్మ, పెంటుబాయి పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు’



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ నాయకులపైన అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో పాటు ఆయన అనుచరులు తనపై, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము అవినీతికి పాల్పడితే ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో లేకుండా తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యాసంగి సీజన్‌లో వరి పంట సాగు చేసిన రైతులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన టార్పాలిన్‌లు, సంచులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. నాయకులు బండు, సముద్రాల రాజన్న, సాజీద్, సంజీవ్, లచ్చన్న, భాస్కర్, పెంటన్న, కొండన్న, సుధాకర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

‘హామీలకే పరిమితమైన కాంగ్రెస్’



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ హామీలకే పరిమితమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు నీటి ముటలుగా మిగిలిపోయాయని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. శ్రీశైలం, లక్ష్మణ్, గణపతి, అశోక్ పాల్గొన్నారు.